క్లుప్తంగా

శాకంబరిగా వాసవీ మాత



సత్తెనపల్లి: ఆషాడ మాసం పురస్కరించుకొని పట్టణ మాచర్ల రోడ్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవీ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరిగా అలంకరించి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో గరుడ వాహన సేవ



సత్తెనపల్లి: పట్టణ రైల్వేస్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీవారికి స్నపన తిరుమంజనం శోభాయమానంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ శ్యాము ఆచార్య రామానుజ దాసన్ మండపంలో వేంచేసి ఉన్న గరుడాళ్వార్ మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికి గరుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు గరుడ వాహనంపై సత్తెనపల్లి పుర వీధులలో గురువారం రాత్రి భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గరుడ ముద్ద, తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీవారి సేవా సమాజం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులచే పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ



నాగవరం(క్రోసూరు): మండలంలోని నాగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7, 8, 9 తరగతుల విద్యార్థులచే పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ శుక్రవారం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సంతకాల సేకరణ ద్వారా ప్రజలకు పొగాకు వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞను తల్లిదండ్రులకు, ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రత్యేక నోటుబుక్ లేదా తరగతి నోట్ బుక్ చివరి పేజీలో సంతకాలను సేకరించాలని, సేకరించేటప్పుడు ప్రతిజ్ఞ వారికి చదివి వినిపించాలన్నారు. సిగరెట్లు, బీడీ, గుట్కాలు, ఖైనీ లాంటి పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండేలా చూడటం ప్రతిజ్ఞ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శివకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డేనియల్, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సుపరిపాలనలో తొలి అడుగు



ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి వెంబడి గృహాల వారికి మాత్రమే కరపత్రం అందిస్తూ ముందుకు సాగారు. అనంతరం గ్రామంలో రూ.15 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సీసీ డ్రెయిన్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోరాటాలలో ప్రజల్ని మమేకం చేయాలి



అమరావతి: గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం సీపీఐ నిర్వహించే ప్రజా పోరాటాలలో ప్రజల్ని మమేకం చేయాల్సిన అవసరం ఉందని అరసం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శరత్‌చంద్ర మాట్లాడుతూ పేద,వెనుకబడిన వర్గాల హక్కులను పరిరక్షణకు సీపీఐ శ్రమిస్తుందన్నారు. రైతులు, కూలీలు, కార్మికుల హక్కుల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. ప్రజానాట్య మండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరా పట్నం రామకృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు, ఏరియా సీపీఐ నాయకులు నాగేశ్వరరావు ప్రసంగించారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొంప ముంచిన ముందస్తు వర్షాలు

- ఎండిపోతున్న పత్తి మొక్కలు
- వర్షం కోసం రైతన్నల ఎదురు చూపులు

అచ్చంపేట: ఈ ఏడాది ముందుగా రుతుపవనాలు వచ్చాయని రైతులు సంబరపడిపోయారు. దీనికి తగ్గట్టుగా ఖరీఫ్ సీజన్‌కు ముందు మే నెలాఖరులో వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమై మొదటి పంటగా వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పత్తి విత్తనాలు వేశారు. విత్తనాలు మొలకెత్తాయో లేదో వర్షాల జాడ లేకుండా పోయింది. బోర్లు, బావుల కింద ఉన్న భూములలో రోజు మార్చి రోజు నీళ్లు పెట్టుకోవడంతో విత్తనాలు మొలకెత్తాయి. మాదిపాడు, చల్లగరిగ, తాడువాయి, గింజుపల్లి తదితర గ్రామాల రైతులు కేవలం వర్షాధారంగానే పంటలు పండిస్తారు. అచ్చంపేట నుంచి వేల్పూరు భూములు కూడా చాలా భాగం వర్షాధారంగానే పంటలు పండిస్తారు. వీరంతా ముందుస్తుగా వచ్చిన వర్షాలకు పత్తి విత్తనాలు వేసి తీవ్రంగా నష్టపోయారు. మొలకలైతే మొలిచాయి గానీ వాటిని కాపాడుకునే మార్గమే రైతులకు అగమ్యగోచరంగా ఉంది. దీంతో ముందస్తు వర్షాలు కొంప ముంచాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

జాడ లేని వర్షాలు

ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా ఉంటాయని ప్రకటనలు రావడం, అందుకు అనుగుణంగా మే మూడవ వారం నుంచే వర్షాలు కురవడంతో రైతులు రెండు పంటలు పండించవచ్చని అనుకున్నారు. గత ఏడాది పత్తి, మిరప వేసి తీవ్రంగా నష్టపోయిన రైతులంతా ఈ ఏడాది మొదటి పంటగా పత్తి, రెండవ పంటగా మొక్కజొన్న, మిర్చి, పసుపు, పొగాకు వంటి పంటలు వేసుకోవచ్చని భ్రమించారు. కానీ భారీగా కురుస్తాయనుకున్న వర్షాలు అసలు జాడే లేకుండా పోయాయి. ప్రతి రోజు సాయంత్రం కొద్దిసేపు వాతావరణం చల్లబడటంతో రైతులు ఆశగా ఆకాశం వైపు చూడటం తప్ప చుక్క వర్షం కురిసిన పాపాన పోలేదు.



వర్షాలు లేక ఎండిపోతున్న పత్తి పంట



వర్షం కోసం ఎదురుచూస్తున్న ఓ వృద్ధ రైతు

మొలిచిన మొక్కను కాపాడుకునేదెలా...

మొలిచిన పత్తి మొక్కను ఎలా కాపాడుకోవాలో రైతులకు దిక్కుతోచడం లేదు. అచ్చంపేట మండలంలో ఇప్పటికి సుమారు 400 హెక్టార్లలో రైతులు పత్తి పైరు వేశారు. ఇందులో నీటి వసతి లేని రైతులు సుమారు మూడొంతుల మంది ఉంటారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టారు. వర్షం పడకపోతే మొలిచిన మొక్కలు ఎండిపోయే పరిస్థితులు ఉన్నాయి. అదే జరిగితే పెట్టిన పెట్టుబడి మొత్తం వృథా అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది వర్షాలు ఎక్కువై పత్తి పంటలు ధ్వంసం కాగా ఈ ఏడాది ఇంతవరకు వర్షాలు లేక పంట కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మిర్చి రైతులు వర్షాలు లేక దిగుబడి రాక, పండిన పంటకు కనీస మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోయారు.

మాకు తప్పదు కదా...



సాలులో ఎక్కడైనా రెండు మూడు చోట్ల మొక్కలు మొలవకపోతే అక్కడ పడి విత్తనాలు వేసుకునే వాళ్లం. కానీ సగానికి పైగా మొక్కలు మొలవకపోతే ఇక పడి విత్తనాలు ఏం వేస్తాం. అలా వేసుకునేకంటే పొలం మొత్తం మళ్లీ దున్నించి మళ్లీ పంట వేసుకుంటే బాగుంటుందనిపిస్తోంది. అప్పుడు ఖర్చు డబల్ అవుతుంది, అయినా వ్యవసాయాన్నే నమ్ముకుని జీవించే మాకు తప్పదు కదా..

– అనుముల సాంబిరెడ్డి, రైతు, అచ్చంపేట

మొక్కలన్నీ ఎండిపోతున్నాయి



ముందుగా వాన కురవడంతో రెండవ పంట వేసుకోవచ్చన్న ఆశతో ముందుగా పత్తి విత్తనాలు కొని, కూలీలతో నాటించినందుకు ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి అయింది. రొండో పంట మొక్కజొన్న వేయాలని నెల రోజుల క్రితం పత్తి విత్తనాలు నాటించా. వర్షం జాడ లేకపోవడంతో మొలిచిన మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. ఇప్పుడు రెండో మారు విత్తనాలు వేసుకోవలసిందే..

– మారేడు సాంబశివరావు, రైతు, రుద్రవరం

విద్యుత్ అదాలత్‌కు 11 సమస్యలు

సత్తెనపల్లి: విద్యుత్ వినియోగదారుల వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని ఏపీసీపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జి ఎస్.విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పట్టణ ఐదు లాంతర్ల సెంటర్‌లోని ఎంవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వారి వద్దకే రావడం జరుగుతుందన్నారు. ప్రధానంగా ప్రతి నెల రెండు ప్రాంతాలకు వెళ్లి ఆ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎలాంటి విద్యుత్ సమస్య ఉన్నా, బిల్లుల్లో తేడాలు ఉన్నా అదాలత్ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. సత్తెనపల్లిలో చేపట్టిన విద్యుత్ వినియోగదారుల అదాలత్‌కు 11 సమస్యలు రాగా ఆరు సమస్యలను వెంటనే పరిష్కరించామన్నారు. మరో ఐదు సమస్యలకు గడువు కేటాయించామని, గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ మెంబర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, టెక్నికల్ మెంబర్ ఎం.శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా ఎస్ఈ డాక్టర్ పత్తిపాటి విజయ్‌కుమార్, మాచర్ల డీఈ సింగయ్య, సత్తెనపల్లి ఏడీఈ రాజశేఖర్‌బాబు, డివిజన్ పరిధిలోని ఇంజనీర్లు, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.



విద్యుత్ అదాలత్‌లో సమస్యలు వింటున్న ఏపీసీపీడీసీఎల్ సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఇమ్మానియేల్

రైతు సంఘ నాయకుడు హనుమంతరావుపై దాడి దుర్మార్గం

అమరావతి: రైతుల పక్షాన పోరాడే రైతు సంఘం నాయకుడు తిమ్మిశెట్టి హనుమంతరావుపై టీడీపీ నేత దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మండల సీపీఎం కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. శుక్రవారం ఆయన సీపీఎం కార్యాలయంలో మాట్లాడుతూ దొడ్లేరు గోదావరి చైతన్య బ్యాంకులో గోల్డ్ రుణాలు తీసుకున్న రైతులను బ్యాంక్ అధికారులు, గోల్డ్ అడ్వైజర్ కుమ్మక్కై మోసం చేసిన నేపథ్యంలో గోల్డ్ బాధితులతో కలిసి రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం బ్యాంకు వద్ద చేపట్టిన ఆందోళనలో పాల్గొని దొడ్లేరు నుంచి క్రోసూరు వస్తున్న తిమ్మిశెట్టి హనుమంతరావు ద్విచక్ర వాహనాన్ని ఆపి క్రోసూరు టీడీపీ అధ్యక్షుడు మొగల్ జానీ, అతని సోదరుడు సమీరు అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తూ దాడి చేయటం దారుణమన్నారు. అధికారం ఉందని సమస్యలపై పోరాటాలు చేసే ప్రజా సంఘాల నాయకులపై దాడులు చేస్తే టీడీపీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. మొగల్ జానీ, సమీర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసే హక్కు ప్రజా సంఘాల నాయకులకు రాజ్యాంగం కల్పించిందని దొడ్లేరు గ్రామం మొగల్ జానీ జాగీర్ కాదన్నారు. పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి బాధితుడు హనుమంతరావుకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మొహిద్దీన్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల సీపీఎం కార్యదర్శి సూరిబాబు

రీ సర్వేపై సమీక్ష సమావేశం

ముప్పాళ్ళ: రీ సర్వే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ కే నగేష్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వే సిబ్బందితో రీ సర్వేపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇప్పటి వరకు జరిగిన రీ సర్వే ప్రక్రియ వివరాలు పరిశీలించారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ చివరి దశకు చేరుకుందని సర్వే సిబ్బంది తహసీల్దార్‌కు వివరించారు. రికార్డుల పరిశీలన చేపట్టాల్సి ఉందని, అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉందని చెప్పారు. ఆయనతో పాటు డీటీ బాలవెంకటేష్, ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల సర్వేయర్లు పాల్గొన్నారు.

బస్సులు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలి



డయల్ యువర్ డీఎంలో సమస్యలు వింటున్న డీఎం విజయ్‌కుమార్

సత్తెనపల్లి: బస్సులు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని పలువురు ప్రయాణికులు కోరారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంలో ప్రయాణికులు ఫోన్ చేసి తమ సమస్యలను డిపో మేనేజర్ విజయ్‌కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. పెదకూరపాడుకు చెందిన ప్రయాణికులు రమేష్, శేషారావు మాట్లాడుతూ రాత్రి 8:30 నుంచి 9:30 మధ్యలో సత్తెనపల్లి నుంచి అమరావతికి బస్సు సౌకర్యం లేనందున బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి డిపో మేనేజర్ విజయ్‌కుమార్ సమాధానమిస్తూ గతంలో ఈ విధంగా బస్సులను నడిపి కలెక్షన్ లేనందు వల్ల రద్దు చేశామన్నారు. సత్తెనపల్లికి చెందిన ప్రయాణికుడు షరీఫ్ మాట్లాడుతూ గతంలో అచ్చంపేటరోడ్‌లో పాత మద్ది సత్యనారాయణ హాస్పిటల్ దగ్గర రిక్వెస్ట్ స్టాప్ ఉండేదని, ఇప్పుడు హాస్పటల్‌కు కొంచెం ముందు ఆపుతున్నారని గతంలో రిక్వెస్ట్ స్టాప్‌ను పునరుద్ధరించాలని కోరగా, సిబ్బందికి తెలియజేస్తామని డిపో మేనేజర్ సమాధానమిచ్చారు. వేల్పూరుకి చెందిన ప్రయాణికుడు రవికుమార్ మాట్లాడుతూ అచ్చంపేట – వేల్పూరు ఫస్ట్ బస్సు తాళ్లచెరువు నుంచి సత్తెనపల్లి వరకు వచ్చే బస్సులకు ప్రయాణికులు నిండుగా ఉంటున్నారని, కనుక వేల్పూరులో ఉదయం 5:20 గంటలకు బస్సు కావాలని కోరారు. దీనికి డిపో మేనేజర్ ప్లాన్ చేసుకొని వీలైన ఎడల బస్సును వేల్పూరుకు తిప్పగలుగుతామన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణం పరిశీలన



పెదకూరపాడు: జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, గ్రావెల్ రోడ్లను పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వాణినాథ్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని బుచ్చయ్యపాలెం గ్రామంలో సుమారు మూడున్నర కిలోమీటర్లు పొలాలకు వెళ్లేందుకు రోడ్లు సక్రమంగా లేక, ఇరువైపులా పిచ్చి చెట్లు పెరిగి ఇబ్బందులు పడుతున్నామని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు రైతులు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రవీణ్ జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.30 లక్షలు గ్రావెల్ రోడ్లు, రూ.5 లక్షలు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మంజూరు చేయించారు. కాంట్రాక్టర్ సిమెంట్ రోడ్డు, గ్రావెల్ రోడ్ల పనులను వేగవంతం చేశారు. శుక్రవారం పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ వాణినాథ్, పంచాయతీ ఏఈ డి.రమేష్ బాబుతో కలిసి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పొలాలకు వెళ్లేందుకు రోడ్లు సక్రమంగా లేక ఇబ్బందులు పడ్డామని, ఈ రోడ్డు వేయడం ద్వారా ఎంతో ఉపయోగపడుతుందని డిప్యూటీ ఈఈ వాణినాథ్‌కు, రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే ప్రవీణకు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులను వాణినాథ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వి.త్రిలోక్ రెడ్డి, పి.సుష్మ , బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, రైతులు ఉన్నారు.

వర్షాల కోసం గ్రామ దేవతలకు జలాభిషేక పూజలు



దొడ్లేరు(క్రోసూరు): వరుణదేవుడు కరుణ కటాక్షాల కోసం మండలంలోని దొడ్లేరు గ్రామ ప్రజలు జలబిందెలతో గ్రామ దేవతలకు జలాభిషేకాలు, పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గంగమ్మతల్లి, పోలేరమ్మతల్లి, శివాలయం, బ్రహ్మంగారి దేవాలయం, తిరుపతమ్మతల్లి, వేంకటేశ్వరస్వామి దేవాలయాలలో రెండు రోజులుగా జలాభిషేక పూజలు చేస్తున్నారు. మూడు రోజుల పాటు జలాభిషేకాలు నిర్వహించి నాల్గవరోజు(ఆదివారం) గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టుకుంటామని భక్తులు చెబుతున్నారు. మండలంలో ఇప్పటి వరకు సరైన వర్షాలు లేక ఒకపక్క రైతులు ఖరీఫ్ సాగుకు, మరో పక్క ప్రజలు గుక్కెడు తాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. జూలై వచ్చినా విత్తనాలు వేయని పరిస్థితిలో రైతన్నలున్నారు. పొలాలు సాగు చేస్తామా, లేదా అనే మీమాంశలో ఉన్నారు. గ్రామ ప్రజలందరూ దేవుడిని వేడుకొంటూ, వరుణిడి కటాక్షం కొరకు ప్రార్థిస్తున్నారు.

దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామంలో గురువారం చోటు చేసుకున్న రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు టి.హనుమంతరావుపై టీడీపీ నాయకుల దాడి ఘటనలో ఇరువర్గాలు చేసుకున్న ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రవిబాబు శుక్రవారం తెలిపారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. 26/2023 OS:52/2021

Between

మద్ది అరుణ ...వాది -DHr

మరియు

బత్తుల వెంకటేశ్వరరావు ...ప్రతివాది -JDr

టు

బత్తుల వెంకటేశ్వరరావు

తండ్రి రామారావు, R/O MRF టైర్స్, డోర్నెం: 12–67, ధరణికోట, అమరావతి మండలం, పల్నాడు జిల్లా.

Flat No:403, #28, SLV Homes, Sulikunte, Dommasandra, Bengaluru.

పై EPలో డిక్రీ హోల్డర్ అయిన మద్ది అరుణ గారు మీపై మీరు తీసుకున్న ఋణం వసూలు నిమిత్తం డిక్రీ పొంది మీ తాలూకు స్థిరాస్తి జప్తు చేసి వేలం వేసి వసూలు పరచుకొనుట కొరకు EP దాఖలు చేసియున్నారు. పై EPలో మీకు ఎన్నిసార్లు EP నోటీసు పంపియున్నాము, మీరు తీసుకోకుండా త్రిప్పి పంపుచూ కాలయాపన చేయుచున్నారు. కావున పై EPకు కోర్టు వారు డి:23-07-2025వ తేదీన మీకు పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసు జారీ చేయమని వాయిదా వేసి యున్నారు. కావున అరోజున ఉదయం గం॥ 10–30ని॥లకు శ్రీ కోర్టు వారు యెదుట మీరు స్వయంగా గానీ లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసి యున్నది. లేనియెడల EP మీ పరోక్షమున తీర్మానించబడును. కావున ఇందు మూలముగా మీకు తెలియచేయడమైనది.

వాయిదా: 23–07–2025

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

శ్రీ సిహెచ్. చిన సత్యనారాయణ
ఎం.ఎ., బి.ఎల్.
అడ్వకేటు, సత్తెనపల్లి.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్

మాదల(ముప్పాళ్ళ): స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని మాదల గ్రామంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ ప్రజలతో మాట్లాడుతూ మీ ఇంటిలో బాగున్న మీటర్లను తొలగించి అదానీ కంపెనీ స్మార్ట్ మీటర్లను బిగించడానికి వస్తున్నారని ముందస్తు అనుమతి లేకుండా మోసపూరిత మాటలు చెప్పి బెదిరించి స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని జాగ్రత్తగా ఉండాలన్నారు. మీటర్లను బిగించి పగలు ఒక రేటు, రాత్రికి ఒక రేటు వచ్చే విధంగా చేసి భారీగా బిల్లులు పెంచడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గారా జాలయ్య, కందిమళ్ళ సాంబశివరావు, ఇందూరి సత్యనారాయణరెడ్డి, చింతపల్లి నాగమల్లేశ్వరరావు, గుంటుపల్లి రజిని, ధరణికోట విమల, కంచర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నవధాన్య సేద్యంతో భూమి సారవంతం

క్రోసూరు: మండలంలోని దొడ్లేరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు షేక్ హజరాబి, గౌస్ సంధాని వ్యవసాయ క్షేత్రాలను జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకులు సైదయ్య సందర్శించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ ఇరువురు రైతులు మే చివరి వారంలో నవధాన్యాల సేద్యం (పీఎండీఎస్)లో ఆహార, పప్పుధాన్యాలు, నూనె గింజలు, సుగంధద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగ, దుంప జాతి మొక్కలు వేయడం జరిగిందన్నారు. దీనివల్ల ప్రధానంగా రైతులకు దిబ్బ ఎరువులపై వెచ్చించే ఖర్చు పూర్తిగా తగ్గుతుందని, అంతేకాక భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవులు, శిలీంద్రాలు చేరడం వల్ల భూమి సారవంతమవుతుందని అన్నారు. రైతు తర్వాత వేయబోయే ప్రధాన పంటకు ఉపయోగించే రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చని, పంటకు చీడపీడలను తట్టుకునే శక్తి, భూమికి పంట ఉత్పాదక శక్తి, నీటిని పట్టి ఉంచే గుణం పెరుగుతుందన్నారు. కావున మిరప, కంది, వరి, కూరగాయలు వివిధ రకాల పంటలు వేసే ప్రతి రైతు ఈ ప్రకృతి వ్యవసాయ విధానంలో పీఎండీఎస్ విధానాన్ని ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో సావిత్రి, అరుణ షహనాజ్, షేక్ బాజీబీ, స్వయం సహాయక సంఘం మహిళలు, రైతులు పాల్గొన్నారు.



దొడ్లేరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన శిక్షకులు సైదయ్య

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు : మండలంలోని పెదకూరపాడు విద్యుత్ సబ్ స్టేషన్, 75 తాళ్లూరు సబ్ స్టేషన్ పరిధిలోని 20 గ్రామ పంచాయతీలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ దాసరి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అచ్చంపేట: మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఏఈ జి.శివకోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విద్యుత్ అంతరాయలను నియంత్రించేందుకు మరమ్మతులు చేపట్టినందువల్ల సరఫరా నిలిపివేయడం అనివార్యమైందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ముప్పాళ్ళ: విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 33/11 కేవీ లైన్ల మరమ్మతులో భాగంగా ఈ నెల 12వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ జీ సుచరిత శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ కోటా పెదమస్తాన్ శుక్రవారం తెలిపారు. అంతరాయాన్ని వినియోగదారులు, రైతులు గమనించాలని ఆయన కోరారు.

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం, బెల్లంకొండ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బెల్లంకొండ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. 33/11 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

6 నుంచి 16 ఏళ్లలోపు పిల్లలకు ఫ్లోరోసిస్ పరీక్షలు చేయాలి

రాజుపాలెం: ఫ్లోరోసిస్ వ్యాధి భూగర్భ జలాలు, ఆహార పదార్థాలు, టీ, కాఫీ, టూత్ పేస్టులలో ఎక్కువగా ఉంటుందని పల్నాడు జిల్లా కన్సల్టెంట్ ఎన్సీడీ డాక్టర్ గిరిధర్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాజుపాలెం, చెంద్రాజుపాలెం ప్రాథమిక కేంద్రాల కమ్యూనిటీ హెల్త్ అధికారులకు శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వలన పిల్లల దంతాలు పసుపు రంగులోకి మారడం, కీళ్లను ప్రభావితం చేయడం జరుగుతుందని తెలిపారు. 6 నుంచి 16 ఏళ్లలోపు పిల్లందరికీ ఫ్లోరోసిస్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రవితేజనాయక్, కమ్యూనిటీ హెల్త్ అధికారి వసంతరావు, అలేఖ్య, లక్ష్మీదుర్గా, శివమాధవి, ప్రియదర్శిని, హన్నాకుమారి, జ్యోత్స్న, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గిరిధర్‌కుమార్

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

రాజుపాలెం: ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రతను పాటించాలని కోటనెమలిపురి ప్రభుత్వ ఆయుర్వేదిక్ డాక్టర్ కోటా శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ వసతి గృహాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేల్పూరి అమ్మా చారిటబుల్ ట్రస్ట్ (తెనాలి) వారు విద్యార్థులకు భోజనం ప్లేట్లను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వార్డెన్ రవిబాబు, హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, టీచర్ మస్తాన్, ఐటీఐ కాలేజ్ ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.